# రైల్లో డిటెక్టివ్

పట్నం పోదామని భద్రం నాప్రాణాలు కొరుక్కు తింటున్నాడు.

వాడికి అడపా దడపా ఎగస్ట్రా వేషాలు వెయ్యకపోతే ప్రాణం నిలవదు. కుతి. బీడీతాగటం మోస్తరే. అలవాటైన ప్రాణ మంటారే – అదీ.

“అమ్మ మంచిగా ఉన్న సమయంచూచి డబ్బు పుచ్చుకుని బయలుదేరదాంలే, భద్రం!” అన్నా.

“అమ్మగారు ఎంతమంచిగా ఉన్నా డబ్బడగగానే ఆ మంచి కాస్తా ఎగిరిపోతుంది గద, గురో!” అన్నాడు భద్రం.

“అయినా అంతకంటే ఉపాయంలేదు భద్రం! మనం హోర్పుగా ఉంపే హవకాశం దొరకక్కపోదు.” అన్నా.

“అ-హంతేలే, గురో!” అన్నాడు భద్రం.

భద్రం నొచ్చుకున్నాడు. నేను డిటెక్షన్ చెయ్యగలను.

"నెల రోజుల్నించి లేని తొందర ఇప్పుడేం వచ్చింది భద్రం? పట్నం పోవాలంటే ఎంతసేపు?" అన్నా.

"రైలెక్కితే పది గంటలే గురో! కాని రైలెక్కటానికో? వారాలు! నెల్లు! ఏళ్లు!"

"ఏళ్ళొద్దుగాని, ఒక్క నెలాగు! అట్టాగే పోవాం!"

"కారినివాలా, ఎగిజ్విషనూ దాటిపోయినాక పోయేం, పోకేం?"

"కారిని—?"

"—వాలా!"

"వాడెవడూ? డిటెక్టివా?"

"కాదు, గురో! సంబరమన్నమాట."

"మంగళగిరి తిరణాలల్లేనా?"

"మంగ—! దానికీ దీనికీ పోలికేంటి, గురో?"

"అంతేనా?"

"మరేంటి, గురో?"

"మొగమోషనన్నావే? అదేంటి?"

"అదీ ఓ తిరణాలే!"

"ఒకటే జనమన్నమాట?"

"ఇస కెయ్యటాని కుండదు."

"ఎన్నో హత్యలు! ఎక్కడ చూసినా అంతకులు! అంతెనా, భద్రం?"

"అంతేనా? ఎక్కడ చూచినా యెర్రటోపీలు, సబ్బులు, సర్కిళ్లు, సూపర్లు!"

"ఇవి ఇప్పుడు జరుగుతున్నయ్యా, భద్రం?"

"ఎల్లుండే ఆరంభం, గురో ! అందుకేగా నా ప్రాణం కొట్టుకు పోతోంది ?"

"నేన్నీకు చాలా హన్యాయం చేశాను భద్రం !"

"ఆదేం లేదులే గురో !"

"నువు ఎగస్ట్రా వేషాలకోసం హతహతలాడి పోతున్నావు అమ టానుకున్నాలే భద్రం !"

"సిత్ !"

"అయితే యివి-అదే, ఆ కారినీవాలా, యెగమోషన్-ఎప్పటి దాకా ఉంటయ్ ?"

"ఒక నెలుంటయి గురో !"

"అయితే జయద్దేరాల్సిందే !"

"హా త్తెరీ !"

"కాని డబ్బెట్లా ? అమ్మ ఇవ్వదేమో?"

"డిటెక్టివ్ కేయాస్ గారికి ఒకరు డబ్బివ్వటమా గురో ? నాకు చాలా యిదైపోతోంది !"

అదీ నిజమేమరి. పెట్టెలో ఉన్న డబ్బు తీసుకోవటమే చాత గాని డిటెక్టివు అంతపల్చి ఏం పడతాడూ ?

"చూడు భద్రం...మామూలుగా అందరి డిటెక్టివులల్లే కాకుండా మనకి డబ్బు దరిద్రమేంటి ? డబ్బుకోసం జేబులో చెయ్యి పెట్టిన డిటెక్టివు నెక్కణ్ణా చూశావ్ ?"

"లేదు, గురో !"

"ఎందుకు చూస్తావ్ ? అట్లా ఉండనే గూడదు. డిటెక్టివన్న వాడికి డబ్బుతో పనుండరాదు. కారులో పెట్రోలూ, వంటింట్లో కాఫీ పొడుమూ అయి పోటమంటూ ఉండకూడదు. ఏమంటావ్"

"సందేహమేంటి గురో ?"

"మరి మనకి ఖర్మేంటి? అనాడు వాడెవడో పావలా ఇస్తా డంటే కేసొదులుకోవటానికూ్కడా నువ్వు సిద్ధపడ్డావా, లేదా? కాఫీకి లేకేనా?"

"అదేమంత కేసులే గురో?"

"అదె నే వప్పను. అందులో మిష్టరీ లేదంటావా? ఆడ శవం మగ శవం ఎట్లా అయింది? శవం లేచి యెట్టా పారి పోయింది? ఆ మిష్టరీ ఇంకా విచ్చలేదు."

"రెండు కప్పులు కాఫీ పొట్టలో పడితే దాని కదే విచ్చేది గురో!...ప్రయాణం కరారన్న మాటేగా?"

"పెట్టెలో డబ్బుంది, నిజమే. అమ్మ దగ్గిర తాళాలున్న మాటా నిజమే. నన్నేం చెయ్యమంటావో నువే చెప్పు. ఆగు! తాళాలు అడగమంటే అడిగేది లేదు. నన్ను సవాళ్ళేస్తుంది. నాపు చెడ్డ మండి పోతుంది. డిటెక్టివయిన వాడు అడుగుతాడు గాని, చెప్పడు. ఏమంటావ్?"

"అది కావంటి మెట్టా?...మీ రడప్కండా మీ చేతికి తాళాలొస్తే సరేనా?"

"కాని ఆ వొచ్చేదెట్టా?"

"అదంతా అడగొద్దు, గురో!"

"ఇందులో నీ మిష్టరీ కొంతా!"

"ఎంత చెడ్డా అసిస్టెంటును గదా గురో?"

భద్రం అన్నంత పనీ చేశాడు. సాయంత్రం అమ్మ పురాణానికి వెళ్ళిన మరుక్షణం వాడు పెట్టె తాళం తెచ్చి నాకిచ్చాడు. నేను గంభీరంగా వెళ్ళి, పెట్టె తెరిచి నాక్కావలసిన డబ్బు తీసుకుని పెట్టె మూసివచ్చి, తాళాలు మళ్ళీభద్రానికి భద్రంగాఇచ్చా

"ఎంతుంది, గురో?"

"రెండొందలు."

"ఇంకో ఇరవై రెండు ముచ్చుపకుండాలే గురో ?"

"హాశ్చర్యం !" అన్నాను, నా కళ్ళను నేనే నమ్మలేకుండా. "ఎట్లా పట్టేశావు, భద్రం ? ఇన్ని డిటెక్షన్లు చూశాగాని ఇంత డిటెక్షన్ ఎక్కడా చూళ్ళేదే ? నన్నే మించి పోతావా ఏంటి ?"

"అంత మాటెందుకులే, గురో ? ఎంత జేసినా అసిస్టెంటుని స్టెంటే; కే యాస్ కే యాసే !"

హోల్ డిటెక్టివ్ ప్రపంచం మొత్తం మీద నా యంటి డిటెక్టివు గాని, భద్రంవంటి అసిస్టెంటుగాని లేడని ఆ క్షణాన నాకు ఢంకామీద బజాయించి చెప్పగల ననిపించింది.

"మరి రైలుకు కొంచెం ముందెళితేనే మంచిది గదా?"

"రైలెన్నింటికి ?"

"తెలీదు, గురో !"

"అయితే పోదాం పద !"

## 2

స్టేషను నిండా లుకలుక లాడుతూ జనం ! ఏ కారణంతో గాని నాకు చానామంది జనాన్ని చూస్తే చీమలమీద జెర్రులు పాకినట్టుంటుంది. తప్పని సరి విధిగా అంత మందినిచూసినప్పుడు వాళ్ళందర్నీ డిటెక్షన్ చేసి పారెస్తే పీడా పోతుందనిపిస్తుంది.

టిక్కెట్టులు తీసుకునే కిటికీ దగ్గిర తోసుకు చస్తున్నారు. నేను చూస్తుండగానే ఒక ముచ్చుట ముడివాడు ఒక బక్కవాణ్ణి డొక్కలో ఒక్క టిచ్చుకున్నాడు. బక్కవాడు కుయ్యోమని ఇవతలి వచ్చి పడ్డాడు. ముచ్చుట ముడివాడు టిక్కెట్టూ, చిల్లరా

తీసుకుని బీడీ వెలిగించుకుంటూ ప్లాటు ఫారం మీదికి వెళ్ళి పోయినాడు.

నేను బక్కవాడి దగ్గిరికి పోయి, "నీ పేరేంటి ?" అని అడిగాను.

"ఉండవయ్యా, నీదో సాపా !" అన్నాడు వాడు.

"నేనెవరో తెలుసా ? డిటెక్టివ్ కే యాస్ ! నా ప్రశ్నలకు సమాధానం చెప్పావంటే నిన్ను డొక్కలో పొడిచిన వాడి ఆచోకీ కనిపెట్టి పోలీసులకు పట్టిస్తాను. చెప్పు నీ పేరు ?"

"యెంకటేశ్వర్లు."

"అయితే నిన్ను డొక్కలో పొడిచిన వాడి పేరు గోవిందయి ఉంటుంది. ఏ డొక్కలో పొడిచాడు ?"

"కుడి డొక్కలో !"

"అయితే వంతెన ఎక్కి బయటకి పోయుంటాడా ? లేక ఈ కటకటాల సందున నుంచు నుంటాడా ? ఏదీ, నువు నాకు కొన్ని క్లూలివ్వాలి. అవి లేందే ఎంత లావుపాటి డిటెక్టివు కూడా అంత కుడి ఎత్తూ, నడకా, పోయిన దిక్కూ తెలుసుకోలేడు. కనక క్లూలు నీ దగ్గిర ఎన్ని ఉంటే అన్నీ గబగబా ఇచ్చెయ్యి !"

"పోవయ్యా, నీదో గొడవా !" అన్నాడు బక్కవాడు, వొంతెన కేసి నడుస్తూ. వాడు కాస్త కలిసి వచ్చినట్లయితె అంతకుణ్ణి అప్పటి కప్పుడే పోలీసు కుక్కల్లే పట్టేసి ఉండేవాణ్ని. డిటెక్టీవు కావాలని ఏ పాపిష్టి వేళ అనుకున్నానో గాని, అందరి డిటెక్టివులతో కలిసొచ్చినట్టు నాతో ఒక్కరూ కలిసి రారాయె.

ఈ విధంగా నేను ఆలోచిస్తున్న సమయంలో, "పదండి, గురో !" అంటూ టిక్కట్టు తీసుకుని నా అసిస్టెంటు భద్రం వచ్చే

శాడు. వాడి వాలకం చూస్తే ఇద్దరు అంతకులను తప్పించుకు వచ్చినట్టుగా ఉంది.

"రెండూ తీశావా ?"

"తీశాను, గురో !"

"పట్నాని కేనా ?"

"పట్నానికే, గురో !"

"కానొ్కండిరా, పట్నం డిటెక్టివులు !" అన్నాను పగ్గిరిగా నవ్వుతూ.

"కాక పోతే యేంటి గురో ! మనం అట్టా వెళ్ళి రిఫెష్మెం ట్రూంలో ఇంత కాఫీ పొయ్యాలె !"

"పద, భద్రం ! అంతకంటె కూడానా ?" అన్నాను.

మేం కాఫీ తాగి బయటికి వచ్చామో ఇంకా రాలేదో, పెద్ద చప్పుడు చేసుకుంటూ రైలు తీవ్రంగా వచ్చేసింది. నేను ఒక పెట్టెలోకి ఎక్కేశాను. భద్రం నా వెంటే ఎక్కాడు. బెంచీలన్నీ జనంతో లుక లుక లాడుతున్నాయి. నేను ఎగిరి గంతేసి పైన ఉండే బెంచీలమీద పెట్టిన పెట్టెలమీద పడుకున్నాను. వెల్లి కిలా పడుకుంటే నాకు చోటు సరిపోయింది. పక్కకు ఒత్తి గిలటానికి లేదు. కింద ఏం జరుగుతున్నదీ వినిపిస్తున్నది మటుకే.

"అంత సోటునా నీకేసెట్టా ?...సామాను ఎక్కినట్టేనా ?... ఇక మీరుండండి, మామయ్యా ! ..రెయిల్ల్ జేసమకో ఎంత సేపాగుతదీ ?...ఇదేం వూరో ? ఎక్కడికి పోతయ్యండీ ? జేబు లోనే పెట్టుకు నుంటారు. ముందు చోటు చూసుక్కోండి... దారిలో ఎక్కడైనా పడి పొయ్యాయా ? ఎళ్ళి చూసొస్తా !... వొద్దు, వొద్దు ! గంటకొట్టారు ! అదుగో కూసింది...కిటికీలొంచి

దూకి సస్తావంట్రా! (ఫెడేల్!) మాయసచ్చిసాడా! (పిల్లాడి ఏడుపు)."

ఇదంతా హాలకిస్తున్నాను. కాని ఒకటీ కనిపించదు, రైలు పెట్టె కప్పుతప్ప. పట్నంపాకా పోవాలి. ఊరికే ఆ కప్పుచేసి చూస్తుంటే ఏం తోస్తుందీ? క్లూ లేమన్నా కనిపిస్తాయేమోనని భూతద్దం కోసం "భద్రం!" అని పిలిచాను. జవాబు లేదు.

భద్రం ఏమయ్యాడు? క్లూలు చూట్టానికి లేక పోగా ఇదో మిష్టరీయా? హగోరించినట్టే వుంది!

## 3

నేను నిద్రపోయానా? డిటెక్షన్ చేసి చూసుకుంటే పోయా నట్లేనే ఉంది.

"టికెట్టి కెట్టి కెట్!"

"ఓయా వయ్యావ్? వా యెవరయ్యావ్? ఆ మీద పడు కుంటాయినా! టిక్కెంటింట సూపియ్. అడుగుతుంటాడు!...మని సికీ సెవుడెట్టా!"

"ఏయ్, మిష్టర్!" మీద ఎవరిదో చెయ్యిపడింది. "మిష్టరీ!" అంటూ కిందికి పడిపోయాను.

"నీ టిక్కెటెక్కడ?" అని అడిగాడు. టిక్కెట్టు కలెక్టరని వెంటనే పోల్చేశా. తీవ్రంగా ఆలోచించి, "భద్రం దగ్గిర ఉండి ఉంటుంది. కావలిస్తే పోయి చూసుకో!" అన్నా, చిరునవ్వుతో.

"వాడెవడు?"

"నా అసిస్టెంటు," అన్నా సూటిగా.

"ఏడీ?"

"అదే మిష్టరీ! నాకింకా క్లూలు దొరకలేదు!"

"వేళాకోళమనుకున్నావా ? టిక్కెట్టు చూపించు ! లేకపోతే పేరు రాసుకుని దింపేస్తా ?"

"నా పేరేమిటో తెలిస్తే అట్లా అనవ్."

"ఏమిటి నీపేరు ? ఎక్కణ్ణించి వస్తున్నావు ? ఎక్కడికి పోతున్నావు ?" అంటూ కలెక్టరు నోటు బుక్కు తీశాడు.

"ఆ వివరాలన్నీ నీకు అనవసరం! టిక్కెట్లు భద్రం దగ్గిరున్నయ్యని చెప్పాను. అంతే !" అన్నాను కఠినంగా.

"అవునండీ ! ఈన వెనకాలే ఇంకో అబ్బాయెక్కి, మళ్ళా దిగి వెళ్ళాడు. వేరే పెట్టెలో ఎక్కుంటాడు" అని పెట్టెలో ఎవరో కలెక్టరుతో చెప్పారు.

"సరే, అట్లావుండు, నీసంగతి తరవాత చూస్తా" అంటూ కలెక్టరు మిగినవాళ్ళ టిక్కెట్లు చూడటం సాగించాడు.

అవతలి బెంచీమీద ఒక యువకుడూ, ఒక యువతీ ఉన్నారు. యువకుడు చాలా హడావుడిగా దేనికోసమో వెతుకుతున్నాడు. కలెక్టరు దగ్గిరికి రాగానే "మా యిద్దరి టిక్కెట్లూ ఎక్కడో జారిపోయినట్టుందండీ, రైలు కదలక ముందునుంచీ వెతుకుతున్నాం" అన్నాడు.

"ఎక్కడెక్కారు ? ఎక్కడికి పోతున్నారు ?"

వాళ్ళు పాపం మాతోపాటే ఎక్కి వస్తున్నారు. ఆ సంగతి తెలియగానే నాకు వాళ్ళను చూసి జాలేసింది. కొంచెం డిటెక్షనుచేసి వాళ్ళ టిక్కెట్లు ఏమయాయో తెల్సుకుందామనిపించింది.

"మా టిక్కెట్టు నంబర్లు 815, 816. కాస్త నోట్ చేసుకోండి" అన్నాడు యువకుడు. "డోన్ట్‌వరీ !" అని ఇంగిలీసులో ఏదో అని కలెక్టరు ఇంకోరి దగ్గిరికి వెళ్ళాడు.

నేను మెల్లిగా ఆ యువకుడూ, యువతీ ఉన్న చోటికి వెళ్ళి యువకుడితో, "మీ పేరు ?" అన్నాను.

"నా పేరుతో నీకేంపని ?"

"హాగ్రహించ కూడదు. నేను డిటెక్టివ్ కే యాన్ను. మీ టిక్కట్లు ఎవరన్నా పిక్పాకెట్టు చేసి ఉంటే ఆ అంతకుణ్ణి పట్టేస్తాను."

ఆనందంతో నవ్వి, ఆ యువకుడు, "నా పేరు రాజసహస్రం. మాది అమృతామలక పురం. నేను లోయర్ కోర్టులో హైయర్ క్రీమ్ టేకరుగా పని చేస్తున్నాను. దయచేసి నా టిక్కట్టులకు వచ్చిన యిక్కట్టులు తెలపండి !"

పరువైన డిటెక్టివుతో మాట్లాడే పద్ధతి అదీ !

"ముందు నాకు ఒక్కటి మీరు తెలపవలసి ఉంటుంది. ఆ వివరాలు దాస్తే ఈ కేసులో నేను కాదుగదా, నాకన్న చిన్న డిటెక్టివుకూడా ఏమీ చెయ్యలేడు. మీరా టిక్కట్లు ఎప్పుడు కొన్నారు ?"

"రైలు బయలుదేరిన కాస్సేపటికల్లా !"

"రైట్. ఎక్కడ కొన్నారు ?"

"సెకండ్ హాండ్ బుక్ స్టాల్లో !"

ఇవన్నీ రాసుకునేందుకు భద్రం ఉంటే ఎంత బాగుండును అన్నట్టు భద్రం ఏమైనట్టు ? మిష్టరీ ! హా !

"మీకు టిక్కెట్లిచ్చిన వాడిపేరు!"

"బైబిల్ వేదుల మత్తయాచారి !"

"హుఁ !" ఆలోచిస్తున్నాను. నాకింకా కావలసిన వివరాలేమిటి ? "అప్పుడు మీ పక్క ఎవరున్నారు ?"

"జడభరతుడూ, అజగరుడూ, హాహా హూహూ, అహోబిలా చారీ!...అంతే, ఇంకెవరూ లేరు!"

"ఇప్పటికీ వివరాలు చాలు. ఎల్లుండి సాయంత్రం లోపల మీ టిక్కెట్టు లెక్కడున్నదీ సరిగా చెప్పగల ననుకొంటాను. ఎక్కడున్నా సరే సందేహించ కుండా నన్ను ట్రింకు చెయ్యండి."

యువకుడు చాలా గట్టివాడు! బోలెడన్ని క్లూ లిచ్చాడు.

## 4

మళ్ళీ మద్రాసు మహా పట్నం! జనం! బస్సులూ, కార్లూ, జనం, మోతా, హారన్లూ, జనం! మిస్టరీ! భద్రం ఏమైనట్టు? డబ్బు కూడా వాడిదగ్గరే ఉండిపోయిందే!

"గురో!"

మిస్టరీ విచ్చిపోయింది. ఈ కేయాస్ కింకా అసిస్టెంటు యోగం వున్నది.

"ఎటు పోయావ్ ఫూల్!"

"ఇంకా నయం, గురో? మీ రెటుపోయారో అని తెగ మిస్టరీ అయిపోయి నే నిదవుతుంటేను! పదండి బయటికి!"

"టిక్కెట్లు భద్రంగా ఉన్నయ్యా?"

"ఈగో!" అంటూ అరిచెయ్యి తీసి చూపించాడు.

"భద్రం! మిస్టరీ!" అన్నాను.

"ఏంటి, గురో?"

"వాటిమీద నెంబర్లు చదువూ?"

"815, 816. ఎందుగ్గురో?"

"ఆ నెంబర్లు ఎందుకు నాకు తెలిసినట్టున్నయ్యా?"

"ఏమో, గురో!"

"మిష్టరీ! సరే పద! తరువాత మిష్టరీ విచ్చుగొడదాం!"

మా టిక్కెట్లు తీసుకున్న గేటు కలెక్టరు, "అట్లా పక్కగా నుంచోండి" అంటూ టిక్కెట్లు మళ్ళీ ఇచ్చేశాడు. ఇంతలో అక్కడికి నాతో రైల్లో వచ్చిన యువతీ యువకుడూ చేరారు. వాళ్ళ వెంట ఆ కలెక్టరున్నాడు. గేటువాడూ, కలెక్టరూ ఏవో ఇంగ్లీషులో మాట్లాడుకున్నారు.

"ఏమండోయ్? ఎవరివీ టిక్కెట్లు?" అని భద్రం కేకేశాడు. అంతకు ముందు వాడి చేతిలో ఉండిన రెండు టిక్కెట్లూ అంత దూరాన పడి ఉన్నయి. దూరంనుంచి కూడా వాటిమీద 815, 816 నెంబర్లు కనిపిస్తూనే ఉన్నాయి.

"అవి మనవి కదూ?" అన్నాను.

భద్రం నాకు కన్ను మలిపి, "మనవి ఎక్కడో పిక్‌పాకెట్టయి పోయాయిగా?" అన్నాడు.

యువకుడు చప్పునవెళ్ళి టిక్కెట్లు తీసుకొని నాకేసి కొరకొరా చూస్తూ బయటికి వెళ్ళి పోయాడు.

కలెక్టరు మా దగ్గరికివచ్చి, "మీరిద్దరూ పచ్చి దొంగల్లాగున్నారే?" అన్నాడు.

"మా టిక్కెట్లెవరో కొట్టేసి మేం హగోరిస్తుంటే, పచ్చి దొంగలమేంటి? యేం చేస్తాం! ఎక్సెజు చెయ్యండి!" అన్నాడు భద్రం.

ఇంతలో కలెక్టరుకు గేటువాడు తోడైనాడు. మమ్మల్ని పోలీసులకు పట్టించడం గురించే చాలా సేపు మాట్లాడుకున్నారు.

"అయ్యా, ఇంతలో ఏదో తపొనతుంది. మేం దొంగల్నిపట్టే

డిటెక్టివులం కాని దొంగలం కాం. రైలులో మాకు కొన్ని మిష్టరీలు జతపడ్డయ్యని నేను ఒప్పుకుంటాను. అంత మాత్రానికి మమ్మల్ని దొంగలని నిందపెట్టటం పెద్దమనిషితారాకాదు!'' అని గంభీరంగా అన్నాను.

''నువు పిచ్చోడివని తెలుస్తూనే ఉంది. మరి వాడి మాటేంటి?'' అన్నాడు కలెక్టరు.

''వాడిచేతులో నేనా టిక్కెట్టు చూశాను!'' అని జలగల్లే మళ్ళా గేటువాడు పట్టుకున్నాడు.

''లెట్ దెమ్ గో టూ హెల్'' అని కలెక్టరు గేటువాడితో ఇంగిలీషులో నచ్చ చెప్పాడు.

ఎట్లాగైతే ఏం మేం బయటపడ్డాం.

''భద్రం!'' అన్నాను.

''ఏం గురో?'' అన్నాడు భద్రం నాకేసి దొంగల్లే చూస్తూ.

''మిష్టరీగా లేదూ?''

''మిష్టరీలన్న మిష్టరీలా, గురో!''

''సరేకాని ఇంగిలీషులో పిచ్చోడీ అంటే ఏమిటీ?''

''అంత యింగిలీసు నాకుమాత్రం వచ్చా గురో!'' అన్నాడు భద్రం.

ఆలోచిస్తున్నాను. నేను పెద్దమనిషినని కనిపెట్టిన ఆకలెక్టరు, భద్రాన్ని ఎందుకు అట్లా చూశాడూ? మిష్టరీ! హాశ్చర్యకరమైన మిష్టరీ!

★